బెస్ట్ ట్రైనర్ ఆదూరి శ్రీనివాస్‌రావు



బండ్లగూడ: రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో 547 మంది సబ్ ఇన్‌స్పెక్టర్ల(ఎస్ఐలు) పాసింగ్ అవుట్ పరేడ్‌లో అకాడమీ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావుకు బెస్ట్ ట్రైనర్ అవార్డు దక్కింది. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇండోర్ సబ్జెక్ట్స్‌లో ఉత్తమ శిక్షణకుడుగా డీజీపీ, డైరెక్టర్స్ మెడల్, సర్టిఫికెట్, ట్రోఫీని అందజేశారు.

తహసీల్దార్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నేతలు

శంషాబాద్: శంషాబాద్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీందర్ దత్తును బుధవారం బీఆర్ఎస్ నేతలు కలిసి సత్కరించారు. రెవెన్యూ సేవలు పారదర్శంగా అందేలా చూడాలని ఈ సందర్భంగా నేతలు తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు దిద్యాల శ్రీనివాస్, బూర్కుంట సతీష్, శంకర్‌రెడ్డి, మంచర్ల మోహన్‌రావు తదితరులున్నారు.

పోలీస్ అకాడమీకి తరలిన నాయకులు



బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన పోలీస్ పరేడ్‌లో నాయకులు తరలివెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతుండడంతో నాయకులు ఘనస్వాగతం పలికారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, పట్నం మహేందర్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిలాద్- ఉన్-న బీ ఊరేగింపునకు పోలీసులు సహకరించాలి

అత్తాపూర్: సెప్టెంబర్ 19న జరిగే మిలాద్-ఉన్-నబీ ఊరేగింపుకు అనుమతితో పాటు ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా పోలీసులు సహకరించాలని సులేమాన్ నగర్ డివిజన్ నాయకులు ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్‌తో పాటు కిషన్ బాగ్ వరకు ఈ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

జలాశయానికి తగ్గిన వరద



బండ్లగూడ: గత కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గాను వరద నీరు ఈసీ వాగు గుండా వచ్చి హిమయత్ సాగర్ జలాశయంలోకి వచ్చి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో గత శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ జలమండలి అధికారులతో కలిసి 5వ నెంబరు క్రస్టు గేటు ఫీట్ మేర ఎత్తి నీటిని ఈసీ నదిలోకి వదిలిన విషయం తెలిసిందే. బుధవారం వరదప్రవాహం తగ్గడంతో ఎత్తిన గేటును మూసివేశారు. జలాశయం పూరిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1761.70 అడుగులు ఉంది. ఇన్‌ఫ్లో 600 క్యూసెక్కుల మేర ఉందని జలమండలి డీజీఎం గోవింద్‌గౌడ్ తెలిపారు.

నిర్మాణ సామగ్రి పడి మహిళ మృతి

మణికొండ: ఇంటి ముందు నిల్చుని ఉన్న మహిళపై పక్కనే నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తు నుంచి మిల్లర్ జాకెట్ పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గండిపేటలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గండిపేట, సాయినగర్ కాలనీకి చెందిన సవల శివలక్ష్మి(51) జీహెచ్ఎంసీలో కార్మికురాలిగా పనిచేస్తుంది. బుధవారం ఆమె తన ఇంటి ముందు నిల్చుని ఉండగా పక్కనే నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి మిల్లర్ జాకెట్ జారి ఆమె తలపై పడింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు అపార్ట్‌మెంట్ యజమాని మల్లేష్, కాంట్రాక్టర్ రాము, మిల్లర్ కాంట్రాక్టర్ రాములు తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డీసీ



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ రవి కుమార్, వివిధ శాఖల అధికారులు

రాజేంద్రనగర్: సర్కిల్ పరిధిలోని పత్తికుంట, పల్లె చెరువు, మీరాలం ట్యాంక్ చెరువులను బుధవారం సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 5వ రోజు రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఉదయం నిమజ్జనానికి గణనాథులు తరలివస్తున్నాయన్నారు. చిన్న గణనాథులను తమ సిబ్బంది నిమజ్జనం చేస్తున్నట్లు తెలిపారు. భారీ గణనాథుల కోసం ప్రస్తుతం మీరాలం ట్యాంక్, పత్తికుంట, పల్లె చెరువు ప్రాంతాల్లో ఒక్కో క్రేన్‌లను ఏర్పాటు చేశామని, మరో రెండు క్రేన్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం మూడు క్రేన్లతో పత్తికుంటలో నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టేలా స్పెషల్ డ్రైవ్‌లను చేపడుతున్నామని వెల్లడించారు. 7,9,11వ రోజుల్లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



నిమజ్జన కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది

ఘనంగా 5వ రోజు నిమజ్జనాలు

బండ్లగూడ: వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలుకాలనీలలో 5 రోజుల పూజల తరువాత బుధవారం వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. హిమాయత్‌సాగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పీరంచెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం సమయంలో పర్యావరణ కాలుష్యాన్ని వీలైనంతవరకు తగ్గించాలని, విగ్రహాలకు ఉండే అలంకరణ వస్తువులను నిమజ్జనానికి ముందు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, విశ్వ మోహన్, జయప్రకాష్, ప్రవీణ్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల బూట్ క్యాంపు ప్రారంభం



బ్యూట్ క్యాంపులో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో వక్తలు

శంషాబాద్ రూరల్: సమగ్ర శిక్ష అభియాన్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యూకేషన్స్ ఇన్నోవేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శంషాబాద్ మండలంలోని వర్ధమాన్ కళాశాలలో 'బూట్ క్యాంప్'ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని (ఫైనాన్స్ బ్యూరో) డైరెక్టర్ గుజ్జు మనుశ్రీ ప్రారంభించారు. పీఎం కార్యక్రమంలో భాగంగా రెండో దశలో నిర్వహిస్తున్న ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) బ్యూట్ క్యాంపు ఇక్కడ రెండు రోజులు పాటు జరుగనుందన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌ను వేదికగా మార్చుకోవాలన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మూడు దశల్లో ఈ బూట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 జూలైలో జరిగే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో గెలుపొందిన విజేతలకు రూ.1.5లక్ష నగదు ప్రోత్సాహకం, వారి ఆవిష్కరణలకు పెటెంట్ హక్కులు కల్పించడంతో పాటు అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని 794 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ తరహాలో ఐడియా ల్యాబ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఈ క్యాంపులో నేర్చుకున్న అంశాలను పాఠశాలలకు వెళ్లిన తర్వాత తోటి విద్యార్థులతో చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీ ఇండోవేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ ఐఎస్. బీమా ఎల్ రెడ్డి, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సంపత్‌రావు, నోడల్ సెంటర్ హెడ్, డీఈఓ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో ఉపాధ్యాయులను సన్మానించిన చైర్మన్ తదితరులు



పనితీరుతో మెప్పించాలి

మణికొండ: మణికొండ ప్రాథమిక పాఠశాల, నార్సింగి ప్రాథమిక పాఠశాలల్లో బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు బుధవారం మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ కౌన్సిలర్ అరుణ జ్యోతిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ పనితీరుతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దటంతో పాటు ఉత్తమ ఫలితాలను రాబట్టేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, కోఆప్షన్ సభ్యులు సిద్దప్ప, తాజుద్దీన్, నాయకులు బీరప్ప, శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

అత్తాపూర్: రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవికుమార్ సంబంధిత అధికారులతో కలిసి సులేమాన్‌నగర్ డివిజన్ మహమూద్ కాలనీ దగ్గర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అస్తవ్యస్తంగా మరెన్నో రోడ్లను ఆధునీకరించాలని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు అనారోగ్యాల భారీన పడకుండా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలన్నారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రెహమత్ అలీ బేగ్ అధికారులను ఆదేశించారు.

నిమజ్జనానికి ఇబ్బందులు రావద్దు



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట కొత్త చెరువు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన పాయింట్ వద్ద ఏర్పాట్లను బుధవారం నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వినాయకులను తీసుకుని వచ్చే వాహనాల ట్రాఫిక్ సమస్య రాకుండా ప్రణాళికతో పనిచేయాలన్నారు. చెరువులో ఎలాంటి చెత్త, పూజాసామాగ్రి వేయకుండా వాటిని అక్కడ ఏర్పాటు చేసే బిన్‌లలో వేసి వినాయకులను మాత్రమే నిమజ్జనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణహితంగా ఉత్సవాలు చేపట్టడం భేష్



గణపయ్యకు పూజలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: గత పదేళ్లుగా పట్టణంలోని వివేకానంద కాలనీలో పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న హిందువికాస్ గణేష్ ఉత్సవ సమితిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ ప్రశంసించారు. మన సంస్కృతి సాంప్రదాయాల్లో భాగమైన ఉత్సవాలను పర్యావరణహితంగా చేపటడం భేష్ అని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్, మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా, కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ తదితరులను ఈ సందర్భంగా హిందువికాస్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి రఘునాథ్‌రెడ్డి స్వాగతం పలికి సన్మానం చేసి వినాయక ప్రతిమలను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేపట్టారు.

అభివృద్ధే ఎజెండాగా పనిచేద్దాం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మాణాలపై జరిగిన ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధే ఎజెండాగా కలసికట్టుగా పనిచేద్దామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు కౌన్సిల్ బయట ఎవరికి నచ్చినట్టు వారు చేసుకోవచ్చని, కౌన్సిల్ సమావేశానికి వచ్చాక ప్రజల శ్రేయస్సునే దృష్టిలో ఉంచుకుని తీర్మాణాలకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుపై రసవత్తర వాగ్వివాదాలు జరిగాయి. చివరకు చేపట్టాల్సిన పనుల తీర్మాణాలపై ఓటింగ్ నిర్ణయించడంతో మెజార్టీ సభ్యులు ప్రకారం తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ నూతన భవన మిగులు పనుల నిర్మాణానికి మరో రూ. 5కోట్లు, పట్టినాగులపల్లిలోని చెత్త డంపింగ్ యార్డు అభివృద్ధికి రూ. 1 కోటి, జలమండలి పైప్‌లైన్‌లు, మరమ్మత్తుల గురించి రూ. 1 కోటి, విద్యుత్ పనుల నిమిత్తం రూ. 25లక్షలు, దసరా, వినాయక చవితి ఉత్సవాలకు రూ. 35లక్షల నిధులను కేటాయిస్తూ తీర్మాణాలు చేశారు. ఇదే తరహాలో దసరా, బతుకమ్మ ఉత్సవాలకు ఘనంగా నిర్వహించాలని మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ, నెక్నాంపూర్, పుప్పాలగూడలకు రూ. 3 లక్షల చొప్పున కేటాయించాలని మెజార్టీ సభ్యులు కోరగా అందుకు అంగీకరించి తీర్మాణం చేశారు.

పీసీసీ అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

మణికొండ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన మహేష్‌కుమార్ గౌడ్‌కు రాజేంద్రనగర్, గండిపేట మండలాల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కీలక పాత్ర పోషించి పార్టీని అధికారంలోకి తెచ్చిన మహేష్‌కుమార్ గౌడ్ రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల అన్ని ఎన్నికల్లో పార్టీని విజయ పతాకాన్ని నిలుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్ యాదవ్, నాయకులు మైలారం శ్రీనివాస్, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం





మైలార్‌దేవ్‌పల్లి: డీసీయంకు బ్రేకులు ఫెయిల్ కావడంతో బీభత్సం సృష్టించింది. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ సిటిజన్ కాంట సమీపంలో కాటేదాన్ నుంచి టీఎన్జీవోస్ కాలనీకి వెళ్తున్న డీసీయంకు ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ కావడంతో రోడ్డు క్రిందికి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఓ మహిళ ద్విచక్రవాహం పూర్తిగా ధ్వంసంకాగా, ప్రమాదంలో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు మహిళను స్థానిక ఆసుపత్రికి తరలించారు. కిరణషాపు షెడ్ పాక్షికంగా ధ్వంసం అయ్యింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

రాజేంద్రనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా బుధవారం ఢిల్లీలో వర్గీకరణకు వ్యతిరేకంగా వందలాది మంది దళిత సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న బహిరంగ సభకు మద్దతుగా.. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు భారీ నిరసన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ మాలల విశ్వరూపాన్ని చూపిస్తామని, గత 15 రోజుల క్రితం మాల ఎమ్మెల్యేలు, మాల ఎమ్మెల్సీలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాట సమితి నాయకులు సీఎంని కలిసి విజ్ఞప్తి కూడా చేస్తామన్నారు. తెలంగాణలో ఎస్సీలకు ఇప్పుడు ఉన్నటువంటి 15 శాతం నుంచి 20 శాతం రిజర్వేషన్లు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం జేఏసీ నాయకులు, మాలల ప్రతినిధి మంత్రి చంద్రశేఖర్, గొడుగు సంజీవ, కావలి అనంతరం , పత్యార నరసింహా తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ పరిధిలోని ఎన్ఎఫ్‌సి కాలనీలో.. పూజల్లో పాల్గొన్న భక్తులు



మంచిరేవుల అంబేద్కర్ యూత్ వినాయక పూజలో పాల్గొన్న యువకులు



మధుబన్ కాలనీ వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



మంచిరేవుల వినాయక పూజలో పాల్గొన్న చిన్నారులు

బస్తీల్లో పర్యటించిన ఎమ్మెల్సీ రమహత్ అలీ

రాజేంద్రనగర్: ఎమ్మెల్సీ రహమత్ అలీ బుధవారం వాజిద్-ఇ-మహమూద్ కాలనీలో రోడ్లు, పారిశుద్ధ్య పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఆయన స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డీసీ రవి కుమార్, అధికారులు పాల్గొన్నారు.



ఇంద్రానగర్ దొడ్డిలో హనుమాన్ యూత్ అసోసియేషన్ గణేష్

ఘనంగా గణనాథుని పూజలు

మణికొండ: వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణనాథుని పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, పట్టినాగులపల్లి, గోలిదొడ్డి, ఖానాపూర్, కోకాపేట, గండిపేట, నార్సింగి, మంచిరేవుల గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటున్నారు. 5 రోజుల పూజలు పూర్తి కావటంతో పలు మండపాలలోని వినాయకులను నిమజ్జనాలకు తరలిస్తున్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణనాథుడికి బుధవారం 4వ రోజు నిర్వహకులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ మండపానికి విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం మండప నిర్వాహకులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

భక్తులకు అన్న ప్రసాదం

శంషాబాద్ రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని కవ్వగూడలో బుధవారం భక్తులకు అన్నప్రసాదం చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద కుక్కల బాల్‌రాజ్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



బండ్లగూడ ఆదర్శనగర్ కాలనీలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్

రైతులకు రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ సొసైటీ రైతులకు బుధవారం రుణాల చెక్కులను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ బి.దానాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్నకారు రైతులకు రూ. 20 లక్షల రుణాల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పంచాయతీ విలీనంపై గ్రామస్తుల ఆందోళన

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దగోల్కొండ పంచాయతీని శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ వెలువడిన గెజిట్‌ను నిరసిస్తూ స్థానికులు బుధవారం ఆందోళన చేశారు. మున్సిపాలిటీ వద్దు-పంచాయతీ ముద్దు అంటూ ప్లేకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఉన్న పెద్దగోల్కొండ పంచాయతీ ఎలాంటి అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. ఇక్కడ అందరూ రైతులు, వ్యవసాయ కూలీలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పంచాయతీ విలీనం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



మణికొండ బీఎం శ్రేయహోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ హోమంలో పాల్గొన్న భక్తులు



అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఉత్సవాల్లో పాల్గొన్న స్థానికులు



మణికొండ సగరసంఘం వినాయక పూజలో మున్సిపల్ చైర్మన్ తదితరులు



గండిపేట ఓషియన్ పార్కులోని గణేష్ పూజలో పాల్గొన్న జ్ఞానేశ్వర్, జైపాల్‌రెడ్డి తదితరులు



కవ్వగూడలో భక్తులకు అన్నప్రసాదం చేస్తున్న బాల్‌రాజ్